క్లుప్తంగా

జగనన్న కాలనీలో నీటి సౌకర్యం



జగనన్న కాలనీలో నూతన బోరు వేయిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: మండల పరిధిలోని పట్నం గ్రామంలో ఉన్న జగనన్న కాలనీలో శుక్రవారం ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ చలపతినాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్‌నాయక్ నీటి సౌకర్యం కల్పించారు. కాలనీలో ఇళ్ల నిర్మాణానికి నీటితో చాలా ఇబ్బందులు పడుతున్నామని గతంలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో కాలనీ వాసులు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన నూతన బోరు వేయించి నీటి సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో పలువురు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు



బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ఎన్పీకుంట: మండల పరిధిలోని గెంగినాయునిపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఎస్టీయూ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. శుక్రవారం స్థానిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఇతర మండలాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు శివరాం, సురేంద్రనాయుడుకు వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి, ఎస్టీయు నాయకులు హరిప్రసాద్ రెడ్డి, రామాంజులు, ప్రధానోపాధ్యాయుడు చరణ్ తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగమ్మ ఉత్సవాలకు విరాళం

తనకల్లు: మండల పరిధిలోని కనసానివారిపల్లి వద్ద వెలసిన ధనకొండ గంగమ్మ ఉత్సవాలకు ఆలయ పునర్నిర్మాణ దాత, ప్రముఖ పారిశ్రామికవేత్త ఎంజీ రెడ్డి రూ. 30 వేలు విరాళం ప్రకటించారు. ఆ మొత్తాన్ని శుక్రవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ వినోద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు సమరసింహారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి చేతుల మీదుగా గోళ్లవారిపల్లి వాసులకు అందజేయించారు. మంచి మనస్సుతో అమ్మవారి ఉత్సవాలకు విరాళం అందజేసిన ఎంజీ రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. విగ్రహ ప్రతిష్ఠ జరిగి 41 రోజులు పూర్తయిన సందర్భంగా ఈనెల 23న బోనాలు, జ్యోతుల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పాడిపరిశ్రమతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న విశాల ఫెర్రర్

పుట్టపర్తి టౌన్: పాడిపరిశ్రమతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని ఆర్డీటీ మహిళా విభాగం డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. శుక్రవారం కొత్తచెరువు మండలంలో మైలేపల్లిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో మహిళా రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల ఫెర్రర్ మాట్లాడుతూ.. మహిళలు మెరుగైన జీవనం సాగించాలన్నారు. అనంతరం బత్తలపల్లి రీజనల్ డైరెక్టర్ ప్రమీల మాట్లాడుతూ.. 2008లో ఈ బృహత్కర కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ ఘన విజయం సాధించారన్నారు. మహిళలు కూలీ పనికి వెళ్లకుండా జీవనోపాధి కోసం పాడి పరిశ్రమ ఉపయోగపడుతుందన్నారు. సమావేశంలో టీం లీడర్ సుధాకర్, సిబ్బంది కావేరి, రాము, శ్రీదేవి కళావతి, సలీమా బేగం, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

ఎంఈఓకు ఆత్మీయ సన్మానం



పుట్టపర్తి ఎంఈఓ వెంకటరమణ నాయక్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ప్రశాంతి నిలయం: పుట్టపర్తి ఎంఈఓగా పని చేస్తూ ఇటీవల బదిలీపై గార్లదిన్నె మండలానికి వెళ్లిన వెంకటరమణ నాయక్‌ను శుక్రవారం పట్టణంలోని శివాలయం వీధిలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆశోక్ కుమార్ రెడ్డి, ఎంఈఓలు ఖాదర్ వలి, ప్రసాద్ తదితరులు వెంకటరమణ నాయక్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పీవీ.రమణారెడ్డి, రజనీకాంత్‌రెడ్డి, ఎర్రిస్వామి, రాజగోపాల్, సుబ్బారెడ్డి, సుధాకర్, కృష్ణమూర్తి, చిన్నాగప్ప, సునీత, శకుంతల, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఆపన్నహస్తం

వలంటీర్లకు వందనం

కదిరి టౌన్: కరోనా వైరస్ విజృంభించిన సమయంలో ఎవరూ గడపదాటి బయటకురాలేదు. వైరస్‌కు గురైన వారిని పలకరించేందుకు బంధువులు కూడా ముందుకు రాని పరిస్థితులు. వెళ్తే తమకు కూడా వైరస్ సోకుతుందనే భయం. ఆ పరిస్థితుల్లో పట్టణంలోని అడపాల వీధి ఏడో వార్డు వలంటీర్ రాగల అశోక్‌కుమార్ కరోనా బాధితులకు అండగా నిలిచారు. బయటి నుంచి సరుకులు, మందులు అందజేశారు. 24గంటలూ వారికి అందుబాటులో ఉన్నారు. అంతేగాకుండా 15 రోజులు సొంత డబ్బు వెచ్చించి వృద్ధులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు.



భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న వలంటీర్ అశోక్‌కుమార్ (ఫైల్)

బంధువులా వచ్చి ఆదుకున్నాడు



నాకు కరోనా సోకిన సమయంలో బంధువులు ఎవరూ కన్నెత్తి చూడలేదు. దయనీయమైన పరిస్థితుల్లో వలంటీర్ ఆశోక్‌కుమార్ మా ఇంటికి వచ్చి నాకు ధైర్యం చెప్పాడు. నిత్యావసర సరుకులు అందజేశారు. వార్డు ఏఎన్ఎం ఇచ్చిన మందుల కిట్లు, పౌష్టికాహారం అందజేశారు. వలంటీర్ వల్ల కరోనా నుంచి త్వరగా కోలుకున్నా.

– గంగులమ్మ, అడపాల వీధి–1,కదిరి

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి



మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

ధర్మవరం: మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డుల్లో మౌలిక వసతుల కల్పనకు తొలి ప్రాధాన్యత ఇచ్చి, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 20వ వార్డులో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు. ఇంటింటికీ తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేద ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. సాంకేతిక కారణాలతో వివిధ ప్రభుత్వ పథకాలు అందని లబ్ధిదారుల సమస్యలు తెలుసుకున్నారు. లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా సంక్షేమ పథకాలు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కేతిరెడ్డి మాట్లాడుతూ.. పట్టణంలోని పీఆర్‌టీ వీధిలోని పెద్ద కాలువ సమస్యను గుర్తించి డ్రైనేజీని నూతనంగా నిర్మించడం జరిగిందన్నారు. అంతేకాకుండా వార్డులో దాదాపుగా ప్రతి వీధిలోనూ సీసీ రోడ్లు నిర్మించామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ వందశాతం అమలు చేసి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. నవరత్నాలు పేరుతో పథకాలను ప్రవేశపెట్టి ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు వేముల జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, వార్డు కౌన్సిలర్ లింగం నిర్మల, వార్డు ఇన్‌చార్జ్ ఉడుముల రాము, సచివాలయాల కన్వీనర్లు చందమూరి నారాయణరెడ్డి, మాసపల్లి సాయికుమార్, కౌన్సిలర్లు పెనుజూరు నాగరాజు, గజ్జల శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు చాంద్‌బాషా, చింతా క్రిష్టయ్య, గుర్రం రాజేంద్ర, కేశగాళ్ల కిష్ట, ఎస్పీ బాషా, కత్తె పెద్దన్న, చిన్నూరు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో సమస్యలకు పరిష్కారం



తలుపుల: లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే పీవీ సిద్దారెడ్డి

తలుపుల: రాష్ట్ర ప్రభుత్వం ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమస్యలకు సత్వర పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి అన్నారు. మండలంలోని లక్కసముద్రంలో శుక్రవారం సర్పంచ్ తులశమ్మ, తహసీల్దార్ శ్రీధర్ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సుమారు 300 లబ్ధిదారులకు సర్టిఫికెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సింగల్ విండో అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి, ఎంపీపీ రఫినాయక్, ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు, సేవాదళ్ జోన్ ఇన్‌చార్జి డీకే బాబు, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఫయాజ్ అహమ్మద్, జేసీఎస్ కన్వీనర్ టోపీ రమణ, వివేకానంద రెడ్డి, పురుషోత్తం రెడ్డి, అంజి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కదిరి అర్బన్: మండల పరిధిలోని మొటుకుపల్లి సచివాలయంలో శుక్రవారం ఎంపీడీఓ అంజనప్ప ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. అనంతరం 510 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఎంపీపీ అమరనాథ్‌రెడ్డి, సర్పంచ్ రూప పాల్గొన్నారు.

కదిరి టౌన్: సచివాలయ వ్యవస్థ ద్వారా పేద ప్రజలకు సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే అందుతున్నామని మున్సిపల్ కమిషనర్ శ్రీహరిబాబు తెలిపారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మూర్తిపల్లి సచివాలయంలో 33, 34 వార్డుల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ పరిధిలోని 27 సచివాలయాలకు చెందిన లబ్ధిదారులకు 12,609 సర్టిఫికెట్లును ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అందజేశారు. గత ప్రభుత్వంలో సర్టిఫికెట్లు కావాలంటే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో దరఖాస్తు చేసుకున్న తక్షణమే ఇంటి వద్దకే 11 రకాల సర్టిఫికెట్లు అందుతున్నాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు పరికి సాధిక్‌బాషా, వార్డు కౌన్సిలర్లు గిరిజమ్మ, సచివాలయ కన్వీనర్లు శ్రీనివాసులు, బొబ్బిలి రవి, రామచంద్ర, ప్రసాద్ పాల్గొన్నారు.

664 ధ్రువీకరణ పత్రాల పంపిణీ..

నల్లమాడ: 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కొండన్న, తహసీల్దార్ దేవేంద్రనాయక్ సూచించారు. నల్లమాడ-3 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం 'జగనన్న సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 664 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుమతి, ఎంపీటీసీ శివారెడ్డి, నాయకులు పొరకల రామాంజనేయులు, మహేష్ నాయక్ పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: జగనన్న సురక్ష ద్వారా ప్రభుత్వం లబ్ధిదారులకు 11 రకాల సేవలను అందించడం జరుగుతోందని ఎంపీడీఓ సౌజన్య కుమారి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గొట్లూరు–2 సచివాలయంలో సర్పంచ్ నందిని, ఉపసర్పంచ్ నాగలూరు మంజునాథ్‌రెడ్డి, ఎంపీటీసీ చెన్నక్రిష్టమ్మ అధ్యక్షతన జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్య, కార్యదర్శి మురళి పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయం: జగనన్న సురక్ష కార్యక్రమంతో పేదలందరికీ న్యాయం జరుగుతుందని ఆర్డీఓ భాగ్యరేఖ పేర్కొన్నారు. శుక్రవారం పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 8, 9 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఓబులపతి, వైస్ చైర్మన్ తిప్పన్న, మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి, సచివాలయాల కన్వీనర్ సుర్యాగౌడ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ రంగారెడ్డి, మెప్మా అధ్యక్షురాలు సాయిలీల, కౌన్సిలర్లు లక్ష్మీదేవి, పవన్‌కుమార్, పరుశురాం నాయక్, చెరువు భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మాధవరెడ్డి, నారాయణరెడ్డి, సహకార సంఘం అధ్యక్షుడు రుషీకేశవరెడ్డి, లింగాల భాస్కర్‌రెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, రాంజీనాయక్, భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఈశ్వరప్ప పాల్గొన్నారు.



ప్రశాంతి నిలయం: పుట్టపర్తిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఆర్డీఓ భాగ్యరేఖ

నేడు జగనన్న సురక్ష

బత్తలపల్లి: మండలంలోని పోట్లమర్రి సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ యుగేశ్వరిదేవి, ఎంపీడీఓ సౌజన్యకుమారి శుక్రవారం తెలిపారు.

చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలోని సచివాలయం–2 పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గంగావతి తెలిపారు.

రామగిరి: పెద్దకొండాపురంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నారాయణస్వామి శుక్రవారం తెలిపారు.

ఖాసీం స్వామికి నిత్యపూజ నివేదన



అలంకరణలో ఖాసీం స్వామి

బత్తలపల్లి: జిల్లాలో గూగూడు తరువాత అంతటి స్థాయిలో మొహర్రం వేడుకలను జరుపుకునే బత్తలపల్లి ఖాసీం స్వామికి నిత్యపూజ నివేదన నిర్వహించారు. శుక్రవారం ఉదయం ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, నజరుల్లా, కాశీంవలి తదితరులు ఖాసీంస్వామి చావిడిలో ఫాతెహాలు చేశారు. మండలంలోని గంటాపురం, ముష్టూరు, మాల్యవంతం, రాఘవంపల్లి, యర్రాయపల్లి, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. గ్రామాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ ఆరోహనరావు, ఎస్ఐ టీవీ శ్రీహర్ష తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



ఉద్యోగుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీపీటీఓ మధుసూదన్

పుట్టపర్తి టౌన్: జిల్లాలో ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని డీపీటీఓ మధుసూదన్ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్టీసీ ఎండీ ఆదేశాలతో జిల్లా డీపీటీఓ కార్యాలయంలో ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించారు. ధర్మవరం–2, హిందూపురం–6, కదిరి–2, పెనుకొండ–2, పుట్టపర్తి–13, డీపీటీఓ కార్యాలయంలో 8 వినతులు అందాయి. ఈ సందర్భంగా డీపీటీఓ మధుసూదన్ మాట్లాడుతూ.. ఆర్టీసీ ఎండీ ఆదేశాల మేరకు నెలలో 3వ శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఉద్యోగుల సమస్యలపై 31 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఆయా డిపోల్లో మేనేజర్లు గ్రీవెన్స్ నిర్వహిస్తారని తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ

రామగిరి: మండలంలోని గంతిమర్రి ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం ఆత్మీయ ట్రస్ట్ చైర్మన్, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో ఏటా మండలంలోని పాఠశాలల్లో ఉచితంగా నోటు పుస్తకాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నాగార్జున, సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, ఎంపీటీసీ కొండప్ప, ఎంఈఓలు మున్వర్‌బాషా, శ్రీనివాసులు, హెచ్ఎం అనంత పద్మనాభం, పాల్గొన్నారు.

పోస్టల్ బీమాను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న పోస్టల్ మేనేజర్ బాలకృష్ణ

ధర్మవరం రూరల్: పాత్రికేయులు పోస్టల్ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని హిందూపూర్ పోస్టల్ మేనేజర్ బాలకృష్ణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో పోస్టల్ బీమా పథకంపై అవగాహన కల్పించారు. సంవత్సరానికి రూ.396 చెల్లిస్తే రూ.10 లక్షల యాక్సిడెంట్ బీమా పొందవచ్చన్నారు. అనంతరం పాత్రికేయులతో రూ.10 లక్షల యాక్సిడెంటల్ బీమా పాలసీకి ఈ–కేవైసీ చేయించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.

కాళసముద్రం చెరువుకు నీటి విడుదల



కాళసముద్రం చెరువుకు హంద్రీ–నీవా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి అర్బన్: హంద్రీ–నీవా కాలువ ద్వారా మండల పరిధిలోని కాళసముద్రం చెరువుకు శుక్రవారం ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక మిగిలిపోయిన తలుపుల హంద్రీనీవా కాలువ పనులు పూర్తి చేసి నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీనీవా జలాలతో నింపుతున్నామన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు కేవలం కుప్పంకు మాత్రమే నీటిని తీసుకెళ్లారని పేర్కొన్నారు. రాబోవు రోజుల్లో లిఫ్ట్ పద్ధతిలో గాండ్లపెంట మండలానికి కూడా పూర్తిస్థాయిలో నీటిని అందిస్తామని హామీ ఇచ్చారు.

ఓటరు జాబితాపై సర్వే ప్రారంభం



అమడగూరులో ఇంటింటికీ తిరుగుతూ సర్వే నిర్వహిస్తున్న తహసీల్దార్ వెంకటరెడ్డి

అమడగూరు: ఓటరు జాబితాపై సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం అమడగూరులో ఇంటింటికీ తిరుగుతూ ఓటరు కార్డులో సభ్యుల వివరాలను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ.. ఆగస్టు 21వ తేదీ వరకూ ఇంటింటా సర్వే జరుగుతుందన్నారు. ఓటరు కార్డులో ఎలాంటి తప్పులున్నా సరిచేసుకోవచ్చన్నారు. మిగిలిన వివరాలకు బీఎల్‌ఓలను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో డీటీ నందిని, ఆర్ఐ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లోని బీఎల్‌ఓలు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల పరిధిలో పర్యటిస్తూ ఓటరు సర్వే చేపట్టారు. ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో బీఎల్‌ఓలు సమావేశాలు ఏర్పాటు చేసి ప్రత్యేక ఓటరు నమోదుపై వివరించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ యుగేశ్వరిదేవి పర్యవేక్షించారు.

కనగానపల్లి: గ్రామాల్లో ఇంటింటా ఓటర్ల సర్వే కార్యక్రమం శుక్రవారం నుంచి ప్రారంభమైంది. మండలంలోని 35 పోలింగ్ కేంద్రాల పరిధిలో బీఎల్‌ఓల ద్వారా ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రమాదేవి తెలిపారు. ఇందుకోసం అవసరమైన రికార్డులు, సామగ్రిని ఇప్పటికే బీఎల్‌ఓలకు అందజేసినట్లు తెలిపారు. కొత్త ఓటర్ల నమోదుతో పాటు తొలగింపులు, చేర్పులు, మార్పులు చేస్తామన్నారు.

శ్మశానవాటికకు స్థల పరిశీలన



శ్మశానవాటిక కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

కనగానపల్లి: మామిళ్లపల్లి గ్రామంలో శ్మశానవాటిక కోసం స్థానిక ప్రజాప్రతినిధులు రెవెన్యూ సిబ్బందితో కలిసి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలోని పూసలకాలనీ సమీపంలో సర్వే నంబరు 392– 5లోని స్థలం ఇందుకు అనుకూలంగా ఉందని, దీనిపై మండల రెవెన్యూ అధికారులకు ప్రతిపాదనలు పంపాలని వీఆర్వో చెన్నకేశవులును గ్రామస్తులు కోరారు. శ్మశానవాటిక లేక కాలనీవాసులు చాలా ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ ఓబిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అమరనాథరెడ్డి, తిరుపాలు, రవీంద్ర తెలిపారు. దీంతో పాటు ఎస్‌డబ్ల్యూసీ (చెత్తతో సంపద తయారీ) కేంద్రం ఏర్పాటుకు స్థలం కేటాయించాలని వారు కోరారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చిరంజీవి, పంచాయతీ కార్యదర్శి వెంకటరాముడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కదిరి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు దీక్షలు చేపట్టారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న హెల్త్ అలవెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపాల్, జనార్దన్, బాలకృష్ణ, సూరి, నరసింహమూర్తి, సీఐటీయూ నాయకులు జీఎల్.నరసింహులు, జగన్మోహన్, ముస్తాక్ తదితరుల పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు

తాడిమర్రి: దోమకాటుకు గురికాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని పబ్లిక్ హెల్త్ నర్స్ (పీహెచ్ఎన్) లక్ష్మీదేవి గ్రామస్తులకు సూచించారు. మండల కేంద్రంతో పాటు పెద్దకోట్ల, కునుకుంట్ల, దాడితోట, పిన్నదరి, ఎం.అగ్రహారం, చిల్లవారిపల్లి, నార్సింపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం వైద్య సిబ్బంది పర్యటించారు. దోమల నివారణ చర్యలు నిర్వహించారు. మురుగునీటి గుంతలను గుర్తించి పైరీత్రియం పిచికారీ చేయించారు. పారిశుధ్యం లోపించిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ పిచికారీ చేశారు.

14.2 మి.మీ వర్షపాతం నమోదు

తాడిమర్రి: మండలంలోని శివంపల్లి, మద్దులచెర్వు, నిడిగల్లు, నార్సింపల్లి, కునుకుంట్ల, పిన్నదరి తదితర గ్రామాల్లో గురువారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. తాడిమర్రిలో 14.2 ఎంఎం వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ సౌమ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల సాగు చేసిన వేరుశనగ, కంది తదితర పంటలకు జీవం వచ్చిందని రైతులు హర్షం వ్యక్తం చేశారు

పాదచారిని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం

కదిరి టౌన్: పట్టణంలోని వేదవ్యాస స్కూల్ వద్ద శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. నల్లచెరువుకు చెందిన వినోద్ కుమార్ ద్విచక్ర వాహనంలో శుక్రవారం రాత్రి కదిరికి బయలుదేరాడు. వేదవ్యాస స్కూల్ వద్ద రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న నాగరాజును ప్రమాదవశాత్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నాగరాజు కాలు విరగడంతో కదిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషంగా ఉండటంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. వినోద్ కుమార్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

దోషులను శిక్షించాలి

కదిరి టౌన్: మణిపూర్‌లో ఇద్దరు మహిళలను నగ్నంగా ఊరేగించిన దోషులను కఠినంగా శిక్షించాలని మహిళలు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టారు. దుండగులను కఠినంగా శిక్షించాలంటూ ప్లకార్డులతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకురాళ్లు శాంతిబాయి, అమరావతి, లక్ష్మీబాయి, రమాదేవి, మణి, నాయకులు జగన్, పాల్గొన్నారు.

మిస్సింగ్ కేసు నమోదు

కదిరి అర్బన్: తన కూతురు కనిపించడం లేదని ఎరుకులవాండ్లపల్లికి చెందిన మునిరత్న అనే మహిళ శుక్రవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సురేంద్ర అనే వ్యక్తిపై అనుమానం ఉందని తెలిపింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

అమడగూరు: ఓడీచెరువు మండలంలోని కొండకమర్ల–1 సచివాలయ పరిధిలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ రాజునాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వలంటీర్లు, పార్టీ నాయకులు రావాలని సూచించారు.